క్లుప్తంగా

బాటసారుల దాహార్తి తీర్చడానికి



భవానీపురం(విజయవాడపశ్చిమ): ఉష్ణోగ్రతలు అత్యధికంగా ఉంటున్న క్రమంలో బాటసారుల దాహార్తి తీర్చడానికి గొల్లపూడిలోని వాసవి ఫార్మా మార్కెట్ కాంప్లెక్స్‌లో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని స్థానిక ప్రముఖుడు బొమ్మసాని సుబ్బారావు బుధవారం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న కాంప్లెక్స్‌లో ఏర్పాటు చేసిన చలివేంద్రం బాటసారులకు ఉపయుక్తంగా ఉంటుందన్నారు. వాసవి ఫార్మా మార్కెట్ కాంప్లెక్స్ కమిటీ కార్యదర్శి దేవతి నాగేశ్వరరావు మాట్లాడుతూ వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకుని చల్లటి మినరల్ వాటర్‌తోపాటు మజ్జిగ కూడా అందజేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో జె. శివప్రసాద్, నీలిశెట్టి చెన్నకేశవులు, అత్యం వెంకటేశ్వర్లు, వినయ్, స్వరూప్, శివాజీ, రంగారావు, శ్రీనివాస్, పలువురు సభ్యులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన

పటమట(విజయవాడతూర్పు): విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశాల మేరకు అగ్ని ప్రమాదాలను నిరోధించడానికి ఆర్ఎస్ బ్రదర్స్ మాల్, సౌత్ ఇండియా షాపింగ్ మాల్, ఏలూరు రోడ్, వీ9 క్లోతింగ్ షోరూమ్, లెనిన్ సెంటర్‌లోని చందనా బ్రదర్స్ షో రూమ్‌లలో వీఎంసీ అగ్నిమాపక సిబ్బంది అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. అగ్ని ప్రమాదం జరగకుండా ఉండేందుకు తీసుకోవాల్సిన నిరోధక చర్యలు, పరికరాలను ఉపయోగించే విధానం, మంటలను ఎలా ఆర్పాలి, ఫైర్ స్ప్రింక్లర్స్, స్మోక్ డిటెక్టర్స్, ఎక్కడెక్కడ అమర్చాలి, వాటి వలన స్మోక్ అలారం ఎలా వస్తుంది, అగ్ని ప్రమాదం జరగకుండా కాంప్లెక్స్ చుట్టూ ఫైర్ సేఫ్టీ మెజర్స్ ఏమేం ఉండాలి వంటి విషయాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో రీజినల్ ఫైర్ ఆఫీసర్ వెంకటేశ్వరరావు, డిస్ట్రిక్ట్ ఫైర్ ఆఫీసర్ మాల్యాద్రి, స్టేషన్ ఫైర్ ఆఫీసర్ రాజా సిబ్బంది పాల్గొన్నారు.

భర్త, అత్తమామలపై వేధింపుల కేసు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): భర్త, అత్తమామల నుంచి తనకు ప్రాణ హాని ఉందని విద్యాధరపురం మసీదు సెంటర్‌కు చెందిన గరికముక్కు నిర్మల దీప్తి భవానీపురం పోలీసులను ఆశ్రయించింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం విద్యాధరపురానికి చెందిన గరికముక్కు నిర్మల దీప్తికి సుజనరాజుతో 2014 లో వివాహమైంది. వీరికి ఇద్దరు పిల్లలు. కొన్నాళ్లు వీరి కాపురం సజావుగా సాగింది. ఆమె భర్త నిత్యం మద్యం సేవించి ఇంటికి వచ్చి శారీరకంగా, మానసికంగా వేధిస్తున్నాడు. ఏ ఉద్యోగం నిలకడగా చేయకుండా ఖాళీగా ఉంటున్నాడు. మద్యానికి డబ్బులు కావాలంటూ భార్యను వేధిస్తున్నాడు. పలు పర్యాయాలు పెద్దల సమక్షంలో, పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయగా భార్యను చక్కగా చూసుకుంటానని అంగీకరపత్రాలు రాసి ఇచ్చాడు. కౌన్సిలింగ్‌లోనే అదే విషయం చెప్పాడు. ఆ తర్వాత మళ్లీ ఎప్పటిలాగే ప్రవర్తిస్తున్నాడు. ఆమె అత్తామామలకు చెప్పినా ప్రయోజనం లేకుండా పోయింది. ఇటీవల ఆమె తల్లి చనిపోవడంతో ఆమె పేర ఉన్న ఆస్తిని రాసి ఇవ్వాలని గొడవ చేస్తున్నాడు. అత్త మణి, మామ సాత్విక్ రాజుకు చెప్పిన వారు కూడా ఆమెతో దురుసుగా ప్రవర్తించారు. దీనిపై ఆమె భవానీపురం పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

అలరించిన సినీ సంగీత విభావరి

విజయవాడ కల్చరల్: తెలుగు కళావాహిని, శ్రీ కళాభారతి, పోలవరపు కోటేశ్వరరావు సాహితీ పీఠం, జీఆర్‌కే సంస్థల ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని కౌతా పూర్ణానందం కళావేదికమీద బుధవారం నిర్వహించిన సినీ సంగీత విభావరి అలరించింది. మల్లాది స్వాతి, వడ్డాది కామేశ్వరి, దుర్గాప్రసాదరావు, కె.డేవిడ్ రాజు, అయ్యప్పన్, మస్తాన్‌వలీ, మధుసూదన్, జోసఫ్ తదితరులు పలు తెలుగు, హిందీ చిత్రగీతాలను ఆలపించారు. తెలుగు కళావాహిని అధ్యక్షుడు చింతకాయల చిట్టిబాబు మాట్లాడుతూ లలిత కళలతోనే మనో వికాసం కలుగుతుందని చెప్పారు. రాగలహరి నిర్వాహకుడు మీరాకుమార్ గాయనీ గాయకులను అభినందిస్తూ ప్రసంగించారు.

- రోడ్డుపైకి చేరిన ఇసుక, మట్టి
- వాహనాల వేగానికి కళ్లలో పడుతున్న ఇసుక రేణువులు
- ఇబ్బందుల్లో వాహనచోదకులు, పాదచారులు

ఇసుక కుప్పలు... జనానికి తిప్పలు





భవానీపురం బైపాస్‌రోడ్డు పక్కన అమృత్‌పార్క్ సమీపంలో పోసిన మట్టి, ఇసుక కుప్పలు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): భవానీపురం గొల్లపూడి బైపాస్ రోడ్డులో అమృత పార్క్ వద్ద రోడ్డు పక్కన నిల్వచేసిన మట్టి, ఇసుక కుప్పలతో వాహనదారులు, పాదచారులు నరకయాతన అనుభవిస్తున్నారు. రోడ్డు మార్జిన్‌లో నిర్మించిన పార్క్‌కు అనుకుని ఇసుక, మట్టి, సిమెంట్ కలిపిన చిప్స్ విచ్చలవిడిగా రోడ్డుపక్కన కుప్పలుగా పోశారు. పార్క్‌లో నిర్మాణ పనుల నిమిత్తం పోసిన ఈ మట్టి, ఇసుక కుప్పలు వాహనచదోకులకు తిప్పలు తెచ్చి పెడుతున్నాయి.

నత్తనడకన అభివృద్ధి పనులు..

గతంలో గొల్లపూడి బైపాస్ రోడ్డులో భవానీపురం చర్చి సెంటర్ నుంచి బీఎస్ఎన్ఎల్ కార్యాలయం వరకు రోడ్డు మార్జిన్‌లో అమృత్ పార్క్ నిర్మించారు. పార్క్‌కు రోడ్డుకు మార్జిన్‌కు మధ్య ఐరన్ మెష్ ఏర్పాటు చేశారు. పార్క్‌లో వాకింగ్ ట్రాక్‌కు ఇరువైపులా సిమెంట్ బ్రిక్స్ ఏర్పాటు చేశారు. ఐరన్ మెష్‌లో కొంతభాగం తెగిపోగా, కొంతభాగాన్ని దొంగలు ఎత్తుకెళ్లారు. వాకింగ్ ట్రాక్ పక్కన ఏర్పాటు చేసిన సిమెంట్ రాళ్లు కూడా దెబ్బతినడంతో నెలరోజుల కిందట పార్క్ అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారు. ఈ పనుల నిమిత్తం రోడ్డు పక్కన పెద్దపెద్ద మట్టి ఇసుక, సిమెంట్‌తో కలిపిన కంకర కుప్పలు పోశారు. పార్కు అభివృద్ధి పనులు నత్తన నడకన సాగుతుండడంతో మట్టి, ఇసుక కుప్పలు అలాగే ఉండిపోయాయి. రోడ్డు మార్జిన్‌లో పోసిన కుప్పలు రోజులు సాగే కొద్దీ క్రమంగా రోడ్డు మధ్యకు వచ్చాయి. వాహనాల రాకపోకలతో రోడ్డుపైకి మట్టి, ఇసుక చెదురుగా పడింది. వాహనాల రాకపోకలకు, గాలులకు ఆమట్టి, ఇసుక పైకి లేచి కళ్లల్లో పడుతుండటంతో పాదచారులు, వాహనదారులు, స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు.

వాహనాలు స్కిడ్..

హెచ్‌బీ కాలనీ ఎంఐజీ నుంచి మెయిన్ రోడ్డుకు అనుసంధానంగా రోడ్లు ఉన్నాయి. మెయిన్ రోడ్డుకు అంతర్గత రోడ్లకు తిరిగే మలుపుల్లో ఉన్న ఇసుక కుప్పలు జారిపోయి ఇసుకంతా చెల్లాచెదురుగా రోడ్లపై చేరింది. మలుపు తిరిగే సమయంలో బైక్‌లు స్కిడ్ అయి వాహనచోదకులు పడిపోతున్నారు. సాయంత్రం వేళల్లో దుమ్ము లేచి దారి కనిపించని పరిస్థితి ఏర్పడుతోంది. రోడ్డు సగానికి కుప్పలు విస్తరించి పెద్ద వాహనాలు వెళ్లేటప్పుడు బైక్‌లపై వెళ్లే వారికి ఇబ్బందులు తప్పడం లేదు. ఇసుక రేణువులు కళ్లలో పడి పలువురు వాహనచోదకులు కింద పడిపోతున్నారు.

దుమ్ము సమస్య తీవ్రం..

వేసవి కాలం కావడంతో సాయంత్రానికి గాలి దుమ్ములు వీస్తున్నాయి. రోడ్డు విశాలంగా ఉండడంతో గాలి బలంగా వీచినప్పుడు దుమ్ము పెద్దఎత్తున లేచిపడుతోంది. కొన్ని కుప్పలు తొలగించిన చోట మిగిలిన మట్టి, దుమ్మును ఊడ్చకపోవడం పెద్ద సమస్యగా మారింది. రోడ్డుకు ఇరువైపులా దాదాపు కిలో మీటరు వరకు ఈ కుప్పలు పోశారు. చుట్టూ వ్యాపార సముదాయాలు ఉండటంతో అక్కడకు వచ్చే వాహనాలు, సందర్శకుల సంఖ్య కూడా అధికంగా ఉంటుంది. ఈ వాహనాల రాకపోకల సమయంలో అటుగా వెళ్లేవారి కళ్లలో ఈ ఇసుక రేణువులు పడుతుండటంతో స్థానికులు నరకయాతన అనుభవిస్తున్నారు. ఇకనైనా కార్పొరేషన్ అధికారులు స్పందించి పార్క్ పనులు త్వరితగతిన పూర్తిచేయడం ద్వారా ఈ మట్టి, ఇసుక కుప్పలను త్వరితగతిన క్లియర్ చేయాలని స్థానికులు కోరుతున్నారు.

శ్రీనివాసునికి చందనోత్సవం



చందనోత్సవంలో శ్రీశ్రీనివాసుడు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): వైశాఖ శుద్ధ తదియ అక్షయ తృతీయను పురస్కరించుకుని చిట్టినగర్‌లోని శ్రీ పద్మావతి, గోదాదేవి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో విశేష పూజలు నిర్వహించారు. అక్షయ తృతీయను పురస్కరించుకుని స్వామివారికి 54 కేజీల చందనంతో విశేషంగా అలంకరించారు. తెల్లవారుజామున స్వామివారికి సుప్రభాతసేవ అనంతరం స్వామివారికి విశేష అలంకరణ, పూజా కార్యక్రమాలను ఆలయ అర్చకులు వినుకొండ రామరత్నమాచార్యులు నిర్వహించారు. అనంతరం స్వామి వారిని పెద్ద ఎత్తున భక్తులు దర్శించుకుని తరలించి ప్రత్యేక పూజలు జరిపించుకున్నారు. సాయంత్రం పంచహారతుల సేవ, ఏకాంత సేవలను నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు లింగిపిల్లి అప్పారావు, మరుపిళ్ల హనుమంతరావు, కోశాధికారి పిల్ల శ్రీనివాసరావు, ఇతర కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

భక్తులకు మజ్జిగ పంపిణీ

సింహాచల అప్పన్న స్వామి చందనోత్సవం పురస్కరించుకుని చింతలపూడి సత్యనారాయణ ఆధ్వర్యాన మజ్జిగ పంపిణీ చేశారు. కేటీరోడ్డులో ఏర్పాటు చేసిన చలివేంద్రం వద్ద జరిగిన మజ్జిగ పంపిణీలో చింతలపూడి సత్యనారాయణ, నల్లబిల్లి కనక, గుండు జితేంద్ర, పల్నాటి ఆది తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా పాలిసెట్



విజయవాడ పిన్నమనేని పాలిక్ క్లినిక్ రోడ్‌లోని నలంద విద్యానికేతన్ నుంచి పాలిసెట్ రాసి వస్తున్న విద్యార్థులు

పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్ష 2025 బుధవారం ప్రశాంతంగా ముగిసింది. విజయవాడ నగరంలోని వివిధ కళాశాలల్లో ఏర్పాటుచేసిన సెంటర్లలో విద్యార్థులు పరీక్ష రాశారు. తల్లిదండ్రులు తమ పిల్లలను తీసుకొచ్చి కేంద్రాల వద్ద దించి లోపలకు పంపించారు. ఆయా పరీక్ష కేంద్రాలు విద్యార్థులతో కిటకిటలాడాయి. కొందరు ఆలస్యంగా వచ్చిన విద్యార్థులను వెనక్కి పంపించారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ





తమ పిల్లలను పరీక్ష కేంద్రానికి తీసుకొస్తున్న తల్లిదండ్రులు



చివరి నిమిషంలో పరీక్ష కేంద్రం వద్దకు విద్యార్థిని

అభ్యర్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ



డీఎస్సీ అభ్యర్థులకు స్టడీ మెటీరియల్ ఇస్తున్న సాంఘిక సంక్షేమశాఖాధికారి కేఎస్ శిరోమణి

పటమట(విజయవాడతూర్పు): డీఎస్సీ అభ్యర్థులు ఉపాధ్యాయ కొలువు సాధించి ఉన్నతంగా సమాజాన్ని తీర్చిదిద్దాలని సాంఘిక సంక్షేమ శాఖ జిల్లా అధికారి కేఎస్ శిరోమణి అన్నారు. సాంఘిక సంక్షేమశాఖ ఆధ్వర్యంలో బుధవారం నగరంలోని మురళి ఫార్చ్యూన్ హోటల్ సమీపంలోని ప్రతిభ కోచింగ్ సెంటర్‌లో ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ఉచితంగా డీఎస్సీ శిక్షణ పొందుతున్న అభ్యర్థులకు ప్రభుత్వం సరఫరా చేసిన స్టడీ మెటీరియల్‌ను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభ్యర్థులకు స్టడీ మెటీరియల్ ఎంతో ఉపయుక్తంగా ఉంటుందని చెప్పారు. సమయాన్ని సద్వినియోగం చేసుకుంటూ కష్టపడి చదవాలన్నారు. ప్రతిభ కోచింగ్ సెంటర్ డైరెక్టర్ జంపాన సుధాకర్ మాట్లాడుతూ ప్రణాళికబద్ధంగా, ఆసక్తితో చదివితే కచ్చితంగా డీఎస్సీలో విజయం సాధిస్తారని పేర్కొన్నారు.

ముగిసిన స్పోర్ట్స్ మీట్



పటమట(విజయవాడతూర్పు): శ్రీచైతన్య స్కూల్ ఆధ్వర్యంలో తమ స్కూల్ ఆంధ్రప్రదేశ్ స్థాయి స్పోర్ట్స్ మీట్ ముగింపు ఉత్సవాలు గోసాలలో ఘనంగా జరిగాయని స్కూల్స్ ఎగ్జిక్యూటివ్ ఏజీఎం మద్దినేని మురళీకృష్ణ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా వివిధ జోన్ల నుంచి వచ్చిన 1500 మంది విద్యార్థులు వాలీబాల్, త్రోబాల్, షటిల్ బ్యాడ్మింటన్, 100 మీటర్ల పరుగు, షాట్‌పుట్ వంటి అంశాల్లో పోటీలు జరిగాయని చెప్పారు. తమ స్కూళ్లలో నాణ్యమైన విద్యతోపాటు క్రీడలకు ప్రాధాన్యం ఇస్తున్నామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఓవరాల్ చాంపియన్‌షిప్ సాధించిన విజయవాడ సిటీ బ్రాంచ్‌ల బృందాలకు, వివిధ అంశాల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందించామని తెలిపారు. ఆయా పోటీల్లో గెలుపొందిన వారికి చైతన్య స్కూల్స్ డైరెక్టర్ సీమా అభినందించారని, ఈ పోటీల్లో పీఈటీ రిసోర్స్ పర్సన్ రాజశేఖర్ పలువురు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారన్నారు.

ఘనంగా జీవీఆర్ కళాశాల వార్షికోత్సవం



విద్యార్థినుల నృత్య ప్రదర్శన



గండూరి శ్రీనివాసమూర్తిని సత్కరిస్తున్న నిర్వాహకులు

విజయవాడ కల్చరల్: ఏపీ భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో దుర్గాపురంలోని ఘంటసాల వెంకటేశ్వరరావు ప్రభుత్వ నృత్య సంగీత కళాశాల 65 వ వార్షికోత్సవం సంగీత కళాశాలలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ పర్యవేక్షణలో విద్యార్థులు ప్రదర్శించిన కూచిపూడి, భరతనాట్యం అంశాలు ఆకట్టుకున్నాయి. సంగీత విభాగానికి సంబంధించిన విద్యార్థినులు దేశ భక్తి గీతాలను వయోలిన్ విభాగం వారు వయోలిన్ మీద వాగ్గేయకార కృతులను ఆలపించారు. వీణా విభాగం వారు వీణపై త్యాగరాజ కృతులను ఆలపించారు. 700 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ప్రిన్సిపాల్ కె.లక్ష్మీనరసమ్మ మాట్లాడుతూ సంగీత కళాశాల 67 ఏళ్లుగా విలువలతో కూడిన విద్యను అందిస్తుందని చెప్పారు. కళాశాలలో సంగీతం అధ్యయనం చేసిన వారు దేశ విదేశాల్లో కచేరీలు నిర్వహిస్తూ సంగీత కళాశాల పేరును జాతీయ స్థాయికి తీసుకెళ్లినట్లు తెలిపారు. వయోలిన్ విద్వాంసుడు గండూరి శ్రీనివాసమూర్తిని కళాశాల నిర్వాహకులు ఆత్మీయంగా సత్కరించారు.

ఆధునిక కవిత్వ రూపశిల్పి మహాకవి శ్రీశ్రీ



శ్రీశ్రీ జయంతి వేడుకలు, గ్రంథావిష్కరణలో పాల్గొన్న అతిథులు

విజయవాడ కల్చరల్: ఆధునిక కవిత్వ రూపశిల్పి మహాకవి శ్రీశ్రీ అని న్యాయవాది వేముల హజరత్తయ్య గుప్తా అన్నారు. ఎక్స్‌రే సాహిత్యసేవా సంస, శ్రీశ్రీ సాహిత్యనిధి ఆధ్వర్యా మహాకవి శ్రీశ్రీ జయంతి సందర్భంగా తుమ్మపల్లిలోని శ్రీశ్రీ విగ్రహం వద్ద ఆయన సాహిత్య జీవితం, ఆయన మీద ఇతర సాహితీవేత్తలు రచించిన గ్రంథాల ఆవిష్కర ణ సభను నిర్వహించారు. గుప్తా మాట్లాడుతూ తెలుగు సాహిత్యంలో ఆయన సాహిత్యం చెరగని ముద్రవేసుకుందన్నారు. ఎక్స్‌రే సాహిత్య సంస్థ అధ్యక్షుడు కొల్లూరి మాట్లాడుతూ ఆయన కవిత్వ ప్రేరణతో ఎందరో యువ కవులు కవిత్వం రాయడం మొదలు పెట్టినట్లు తెలిపారు. అశోక్‌కుమార్ శ్రీశ్రీ సాహిత్యనిధి ద్వారా ఆయన సాహిత్యాన్ని నేటి తరానికి అందిస్తునట్లు తెలిపారు. జ్వాలాతోరణం, ఘంటసాల గళంలో శ్రీశ్రీ కలం, శ్రీశ్రీ పద్యపానం, విభిన్న గళాల్లో శ్రీశ్రీ కలం, బాలు గళంలో శ్రీశ్రీ, పలు పుస్తకాలను అతిథులు ఆవిష్కరించారు. ఆవిష్కరణ సభలో సింగంపల్లి అశోక్‌కుమార్, బోడి ఆంజనేయరాజు, గోళ్ల నారాయణరావు, చలపాక ప్రకాష్, సీనియర్ జర్నలిస్ శర్మ, మోండువు ప్రసాద్ వివిధ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు. నిర్వాహకులు శ్రీశ్రీ విగ్రహానికి ఎర్ర జెండాకప్పి నివాళులు అర్పించారు.

కూటమి ప్రభుత్వ తీరు దుర్మార్గం

షేక్ ఆసిఫ్

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): సింహాచలం ఆలయం వద్ద ఎనిమిది మంది భక్తులు మృతి చెందటం అత్యంత బాధాకరమని వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్ ఆసిఫ్ పేర్కొన్నారు. మరణించిన కుటుంబాలను పూర్తిస్థాయిలో ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఆలయాల్లో ఇలాంటి ఘటనలు జరగకుండా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇటువంటి ఘటనలు వరుసగా జరుగుతున్నా ప్రభుత్వ తీరులో మార్పు రాకపోవడం దుర్మార్గమని పేర్కొన్నారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నట్లు తెలిపారు. ఘటనకు బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

- సింహాచలం ఘటనలో ఎనిమిది మంది మృతి చెందడం చాలా ఆవేదనగా ఉందని వైఎస్సార్ సీపీ గుంటూరు పార్లమెంట్ నియోజకవర్గ పరిశీలకుడు పోతిన మహేష్ పేర్కొన్నారు. మరణించిన వారి కుటుంబాలకు కూటమి ప్రభుత్వం కోటి రూపాయల ఎక్స్‌గ్రేషియా, ప్రభుత్వ ఉద్యోగం, సొంతిల్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. మరణించిన 8 మందిలో పిళ్లా ఉమామహేశ్వరరావు, పిళ్లా శైలజ, పైలా వెంకటరత్నం, గుజ్జారి మహాలక్ష్మి నగరాల సామాజిక వర్గానికి చెందిన వారిని పేర్కొన్నారు.

బాల్య వివాహాల నిరోధంపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న డాక్టర్ కీర్తి

భవానీపురం(విజయవాడపశ్చిమ): బాల్య వివాహాలు, బాలల హక్కుల పరిరక్షణపై మత పెద్దలకు వాసవ్య మహిళా మండలి డైరెక్టర్ డాక్టర్ బి.కీర్తి అవగాహన కల్పించారు. బుధవారం జక్కంపూడి వైఎస్సార్ కాలనీలో వివిధ మతాలకు చెందిన పెద్దలతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. దేశంలో అతి పెద్ద పౌర సమాజ సంస్థల నెట్‌వర్క్ అయిన జస్ట్ రైట్స్ ఫర్ చిల్డ్రన్స్ (జేఆర్సీ) బాలల హక్కులను పరిరక్షించడానికి ఒక ప్రచారాన్ని ప్రారంభించిందని వివరించారు. ఎన్టీఆర్ జిల్లాలో ఆ సంస్థకు అనుబంధ సంస్థ అయిన వాసవ్య మహిళా మండలి ఆధ్వర్యాన అక్షయ తృతీయ, పెళ్లిళ్ల సీజన్ దృష్ట్యా బాల్య వివాహాలను నిరోధించడానికి వివిధ మతాలకు చెందిన పురోహితులకు అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. 2030 నాటికి దేశంలో బాల్య వివాహాలను నిర్మూలించాలన్న లక్ష్యంతో జేఆర్సీ సంస్థ 'బాల్య వివాహ రహిత భారత్' ప్రచారాన్ని నిర్వహిస్తుందని పేర్కొన్నారు. బాల్య వివాహ నిరోధక చట్టం (పీసీఎంఏ) ప్రకారం ఇది శిక్షార్హమైన నేరమని, రెండేళ్ల వరకు జైలు శిక్ష, లేదా జరిమానా లేదా రెండూ విధించవచ్చని తెలిపారు. బాల్య వివాహం అంటే పిల్లలపై అత్యాచారమే అన్నారు.

కృత్రిమ మేధలో మెషిన్ లెర్నింగ్ పాత్ర కీలకం



మాట్లాడుతున్న డాక్టర్ శ్రావణి

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): కృత్రిమ మేధస్సులో మెషిన్ లెర్నింగ్ కీలకమైన భాగంగా మారిందని ఎస్ఆర్ఎం యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ శ్రావణి ఆనందరావు అన్నారు. కేబీఎన్ కళాశాల పీజీ విభాగం, కంప్యూటర్ సైన్స్ అండ్ అప్లికేషన్స్ ఆధ్వర్యంలో బుధవారం పీజీ విద్యార్థుల కోసం 'మెషిన్ లెర్నింగ్' అనే అంశంపై గెస్ట్ లెక్చర్‌ను నిర్వహించారు. ముఖ్యవక్త శ్రావణి మాట్లాడుతూ మెషిన్ లెర్నింగ్‌లో ప్రధానమైన సూపర్వైజ్డ్ లెర్నింగ్ గురించి వివరించారు. మెషిన్ లెర్నింగ్ టెక్నాలజీ వినియోగం డేటా మైనింగ్, ఫైనాన్షియల్ ప్రెడిక్షన్, మెడికల్ డయాగ్నోసిస్, రికమెండేషన్ సిస్టమ్స్, స్పీచ్ – ఇమేజ్ రికగ్నిషన్, నేచురల్ లాంగ్వేజ్ ప్రాసెసింగ్ వంటి అనేక రంగాల్లో విస్తరించిందన్నారు. సిరి, గూగుల్ అసిస్టెంట్, అలెక్సా వంటి వర్చువల్ అసిస్టెంట్లు, ఈ-కామర్స్ సైట్లలో కనిపించే ఉత్పత్తి సిఫార్సులు, ఆరోగ్యరంగంలో రోగ నిర్ధారణ వంటి వినియోగాలు మెషిన్ లెర్నింగ్ ద్వారా జరుగుతున్నట్లు చెప్పారు. భవిష్యత్‌లో మెషిన్ లెర్నింగ్ విద్య, రవాణ, శక్తి నిర్వహణ మొదలైనవాటిలో విస్తరించే అవకాశం ఉందన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ కృష్ణవేణి మాట్లాడుతూ ఆధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని విద్యార్థులు ఎప్పటికప్పుడు అందిపుచ్చుకోవాలన్నారు. హిందూ హైస్కూల్స్ కమిటీ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ డాక్టర్ నారాయణరావు మాట్లాడుతూ నిరంతర సాధనతో సాంకేతిక పరిజ్ఞానం గురించి ఎక్కువ అవగాహన కలుగుతుందన్నారు. కార్యక్రమంలో పీజీ విభాగం డైరెక్టర్ డాక్టర్ ఎస్ వెంకటేష్, విభాగాధిపతి డాక్టర్ వీటీ రామ్‌పవన్, వైస్ ప్రిన్సిపాల్స్ డాక్టర్ ఎం.వేంకటేశ్వరరావు, పీఎల్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.